నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 11-10-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:26 సంచిక: 64 పేజీలు:4 వెల: రూ.1/-

శంషాబాద్ చోరీ కేసుని చేధించిన పోలీసులు

రంగారెడ్డి అక్టోబర్ 10: శం షాబాద్ లో కన్యకా పరమేశ్వరి దేవాలయం చోరీ కేసుని పోలీసులు చేధించారు. దుండగుడు అక్టోబర్ 2వ తేదీన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని దేవాలయంలో చోరీకి పాల్పడి టెంపుల్ లో ఉన్న అమ్మవారి ముక్కు పుడక, 2 వెండి కళ్ళను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. చోరీకి పాల్పడిన ధన్ రాజ్ అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ సింప్లెక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలో ధనరాజ్ అనే వ్యక్తి బైక్ పై వెళ్తుండగా అతన్ని ఆపి ఫింగర్ ప్రింట్స్ చెక్ చేయగా..ఫింగర్ ప్రింట్ ఆధారం గా పాత నేరస్తుడిగా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. అతన్ని పూర్తిస్థాయిలో విచారించగా అతనిపై సిద్దిపేట తోపాటు దుండిగల్, జడ్జర్లలో రెండు, ఆర్జీఐఏ పీఎస్ లో రెం డు...మొత్తం ఐదు కేసుల్లో నింది తుడిగా ఉన్నట్లు గుర్తించారు. నింది తుడు ధన్ రాజ్ రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం సురారం ప్రాంతానికి చెందిన వాడిగా గుర్తించారు. నిందితుడి నుండి 130 గ్రాముల బంగారం, రెండు పందల గ్రాముల వెండి పట్టీలు, ఒక పల్సర్ బైక్ స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. ధన్ రాజ్ పై పీడియాక్ట్ కూడా నమోదు చేస్తామని శంషాబాద్ ఏసీపీ అశోక్ కుమార్ తెలియజేశారు.

ఆర్టీసీ సమ్మెపై విచారణ వాయిదా

– ఈనెల 15కు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్10 (ఆర్ఎన్ఎ) : తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న సమ్మెపై గురువారం హైకోర్టులో వాదనలు జరిగాయి. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమన్యం తరపున, కార్మికుల సంఘాల తరపున లాయర్లు తమ వాదనలు వినిపించారు. ఇరువురు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశాయి. మరోవైపు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ప్రభుత్వం న్యాయసానానికి తెలిపింది. అంతేకాదు కార్మికుల సమ్మె చట్ట విరుద్ధమని కోర్టుకి తెలిపింది. ఈ సందర్భంగా కోర్టు జోక్యం చేసుకుని బస్ పాస్ హోల్డర్స్‌ను ప్రయాణానికి అనుమతి ఇస్తున్నారా అని ప్రశ్నించింది. ఇప్పటికే అన్ని డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చామని ప్రభుత్వం పేర్కొంది. అయితే, మరోసారి పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. అంతేకాదు, ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌పై అసంతృప్తి వ్యక్తం చేసింది. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వ నివేదిక అస్పష్టంగా ఉందని అభిప్రాయపడింది. తదుపరి విచారణను అక్టోబరు 15కు వాయిదా వేసింది. అంతకు ముందు ఇరుపక్షాలు వాదనలు వినిపించాయి. ప్రజలను ఇబ్బంది పెట్టాల్సిన ప్రయత్నం కార్మికులు చేయడం లేదని, చాలాసార్లు సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగిందని కార్మిక సంఘాల తరపున న్యాయవాది రచనా రెడ్డి వాదించారు. ఇవ్వాల్సిన సబ్సిడీ, రాయితీలు ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగాలకు సంబంధించిన జీతభత్యాలు, ఇతరత్రా వాటిని పరిష్కరించాలని కోరినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరిస్తే.. కార్మికులు వెంటనే సమ్మె విరమిస్తారని చెప్పారు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తరపున అడ్వకేట్ తమ వాదనను వినిపించారు. కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి సమయం ఇవ్వాలని కోరినా.. వారు వినిపించుకోలేదని కోర్టుకు తెలిపారు. గత నెల 29వ తేదీన సునీల్ శర్మ ఆధ్వర్యంలో కమిటీ నియమించడం జరిగిందని తెలిపారు. కమిటీ నిర్ణయం తీసుకోకముందే కార్మికులు సమ్మెలోకి వెళ్లాయని అన్నారు. ఇదిలా ఉంటే హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తాను కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడానికి 10రోజుల గడువు కావాలని ఆర్టీసీ గుర్తింపు సంఘాలు, జేఏసీ ధర్మసనాన్ని కోరాయి. సమస్య పరిష్కారానికి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఇదిలా ఉంటే కోర్టులో వాదనలు జరుగుతున్న సమయం లో జనసమితి అధినేత కోదండరాం హైకోర్టుకు వచ్చారు. ఇదిలా ఉంటే మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె ప్రభావం పడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతోంది. దసరా సెలవులకు ఊళ్లకు వెళ్లిన వారు శని, ఆదివారాల్లో ఎక్కువశాతం పట్టణాలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగిన విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఇప్పటికే సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు.

మాజీమంత్రి మాదాటి మృతి

సిఎం కెసిఆర్ సంతాపం

హైదరాబాద్,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఎపి మాజీ మంత్రి మాదాటి నరసింహారెడ్డి(85) కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్ లోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లికి చెందిన నరసింహారెడ్డి మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుకు అత్యంత సన్నిహితులు. నర్సింహారెడ్డి, టిడిపిలో పలు పదవుల్లో పని చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ నరసింహారెడ్డి కీలక పాత్ర పోషించారు. శుక్రవారం నరసింహారెడ్డి అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన మృతి పై తెలంగాణ సిఎం కెసిఆర్, కరీంనగర్ మాజీ ఎంపి వినోద్ కుమార్ తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.

ప్రేమోన్మాది ఘాతుకం

యువతిపై పెట్రోల్ పోసి హత్య తానూనిప్పంటించుకుని మృతి

తిరువనంతపురం, అక్టోబర్ 10 (ఆర్ఎన్ఎ): ఓ ప్రేమోన్మాది యువతిపై పెట్రోల్ పోసి నిప్పంటించి, తాను కూడా నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేరళలోని ఎర్నాకులం జిల్లా కకానాడ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మిథున్ అనే వ్యక్తి అమ్మాయి ఎనిమిదో తరగతి చదువుతున్నప్పటి నుంచి వేధించేవాడు. గతంలో అమ్మాయి (17) తల్లి తరుపు బంధువు అతడు కావడంతో మందలించి వదిలేశారు. గత వారం రోజుల క్రితం అమ్మాయిని ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకోవాలని మిథున్ బెదిరించడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు చేశారు. మిథున్ పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఇద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. దీంతో అమ్మాయిపై పగ పెంచుకున్న మిథున్ గురువారం వాళ్ల ఇంటికి వెళ్లి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పింటించాడు. తాను కూడా పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే తండ్రి స్పందించి ఆమెను ఆస్పత్రికి తరలించాడు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన తల్లి స్పృహ తప్పిపడిపోయింది. మిథున్‌ను కూడా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మిథున్, అమ్మాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేరళలో గతంలో ఇలాంటి ఘటనలు నాలుగు చోటుచేసుకున్నాయని పోలీసుల వెల్లడించారు. మార్చిలో కవిత విజయ్ కుమార్ అనే అమ్మాయిపై ప్రేమోన్మాది నిప్పంటించి తగల బెట్టాడు. కవిత చికిత్స పొందుతూ వారం రోజుల తరువాత మృతి చెందింది. ఏప్రిల్‌లో నీతూ (22) అనే ఇంజినీరింగ్ విద్యార్థిని ప్రేమోన్మాది నిధీస్ కత్తితో పొడిచి పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశాడు. వల్లికన్నన్ పోలీస్ స్టేషన్‌లో పని చేసే మహిళ కానిస్టేబుల్ పుష్పక రణ్‌పై సహోద్యోగి కత్తితో పొడిచి పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశాడు. వీళ్లు అందరూ చనువుగా ఉండి అమ్మాయిలు పెళ్లికి నిరాకరించడంతోనే ఈ హత్యలు చేశారని పోలీసులు వెల్లడించారుః

అన్ని జిల్లాల్లో చేపల పెంపకం

మత్స్యకారుల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం : తలసాని

హైదరాబాద్,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): దాదాపు అన్ని జిల్లాల్లో చేపపిల్లల పెంపకం చేపట్టామని, అన్ని చెరువులు, ప్రాజెక్టుల్లో చేవిత్తనాలను వదిలామని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ చెప్పారు. రాష్ట్రంలో చేప పిల్లల అభివృద్ధి, మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. చిన్న కుంటల్లోనూ చేపపిల్లల పెంప కానికి బడ్జెట్ పెంచాలని ముఖ్యమంత్రిని కోరతామన్నారు. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారని అన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉచితంగా విత్తనాలను అందించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మత్స్యశాఖకు కేవలం రూ.కోటి మాత్రమే బడ్జెట్ ఉండేదని, తెలంగాణ రాష్ట్రంలో రూ.100 కోట్లకు ఆ బడ్జెట్‌ను పెంచామని మంత్రి అన్నారు. తాను అన్ని జిల్లాల్లో పర్యటించి చేపల పెంపకాన్ని ప్రారంభించానని అన్నారు. మత్స్యకారులంతా సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారని అన్నారు. బీసీల సంక్షేమానికి సీఎం కట్టుబడి ఉన్నారన్నారు. 119 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బీసీ కమిషన్‌ను సైతం ఏర్పాటు చేశామన్నారు. గీత కార్మికులకు రూ.5 లక్షలకు పరిహారం పెంచామని, వారి సొసైటీలను బలోపేతం చేసామన్నారు. గొర్రెల పెంపకానికి రాష్ట్రంలో యాదవులకు రూ.400 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీడీఎస్ కింద కేటాయించిందని, జిల్లాకు రూ.40 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. త్వర లో గొర్రెల యూనిట్లు అందిస్తామన్నారు. రాబోయే రోజుల్లో మరింత బడ్జెట్ కేటాయిస్తామని, అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. జిల్లాల ఏర్పాటుకు సంబంధించి తాను గద్వాల జోగులాంబ జిల్లాను ప్రారంభి స్తానని అన్నారు. జిల్లాల ఏర్పాటుతో పాలన వికేంద్రీకరణ జరగగలదన్నారు. అవసరాన్ని బట్టి ఏర్పాట్లు చేశారని అన్నారు.

వి హెచ్‌పి కార్యకర్తలపై పోలీస్ కేసు

భోపాల్,అక్టోబర్10 (ఆంఎన్ఎ):మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో 150 మంది విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 8న ఆయుధ పూజలో భాగంగా వీహెచ్‌పీ కార్యకర్తలు, భజరంగ్‌దళ్ కార్యకర్తలు సంయుక్తంగా బహిరంగ స్థలంలో, జన సమూహమున్న ప్రదేశంలో తుపాకులతో గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం వారి నినాదాలతో అక్కడి ప్రాంతాన్నంతా హోరెత్తించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఈ చర్యలకు పాల్పడినందుకు గానూ, ప్రజలకు ఇబ్బంది కలిగించినందుకు గానూ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

రెండో సంతానం కోసం ఘాతుకం

సవతి కూతురిని చంపిన కసాయి తల్లి

చెన్నై,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): తమిళనాడులోని సెలియాపూర్‌లో ఆరేళ్ల పాపను సవతి తల్లి గొంతు పిసికి అనంతరం మూడంతస్థుల భవంతి నుంచి కింద పడేసి చంపింది.

రెడో సంతానం కోసం ఆమె ఈ ఘాతుకానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. 2015లో ప్రతిభన్ అనే వ్యక్తి శరణ్య అనే మహిళను పెళ్లి చేసుకున్నాడు. అనంతరం దంపతులకు పాప జన్మించింది. పాపకు రాఘవి అనే పేరు పెట్టారు. రాఘవి చిన్నగా ఉన్నప్పుడు శరణ్య అనారోగ్యంతో చనిపోవడంతో ఆమె భర్త రెండో పెళ్లి చేసుకున్నాడు. సూర్యకళ అనే అమ్మాయిని ప్రతిభన్ వివాహం చేసుకన్న అనంతరం వీరికి ఒక బాబు జన్మించడంతో సవతి కూతురిని సూర్యకళ పట్టించుకునేది కాదు. సవతి కూతురు అమ్మమ్మ వలమర్తి కూడా వీళ్ల ఇంట్లోనే ఉండడంతో సూర్యకళకు నచ్చేది కాదు. తమకు ఇద్దరు పిల్లలు ఉన్నారని రెండో సంతానం వద్దని భర్త ఆమెకు పలుమార్లు సూచించాడు. ఆమె మాత్రం రెండో సంతానం కోసం భర్తతో గొడువ పెట్టుకున్న కూడా ఆయన తిరస్కరించేవాడు. దీంతో సవతి కూతురిని చంపితే రెండో సంతానానికి భర్త ఒప్పుకోవడంతో పాటు సవతి కూతురు అమ్మమ్మ ఇంట్లో నుంచి వెళ్లిపోతుందని ప్లాన్ వేసింది. భర్త ఆఫీస్‌కు వెళ్లగానే సవతి కూతురిని గొంతు పిసికి చంపి అనంతరం మూడో అంతస్థు నుంచి ఆ బాలికను కింద పడేసింది. తన భర్తకు ఫోన్ చేసి రాఘవి కనిపించడంలేదని తెలిపింది. స్థానికంగా వెతకగా రాళ్ల మధ్యలో బాలిక మృతదేహం కనిపించిందని భర్తకు తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి సూర్యకళపై అనుమానం కలిగింది. వెంటనే తనదైన శైలిలో పోలీసులు ప్రశ్నించగా అసలు నిజాలు ఒప్పుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి సూర్యకళను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

భారతదేశం శాంతికి నిలయం

– భావితరాలకు తెలంగాణ సంప్రదాయాన్ని తెలియజేయాలి
– అలయ్ బలయ్‌లో అందరూ పాల్గొనటం సంతోషంగా ఉంది
– హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ
– గవర్నర్‌గా రావటం అదృష్టంగా భావిస్తున్నా – గవర్నర్ తమిళసై
– దేశాభివృద్ధికి ఏకమవ్వాలి – కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్10 (ఆర్ఎన్ఎ) : చెడు మీద మంచి సాధించిన విజయమే 'విజయ దశమి' అని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం జల విహార్‌లో అలయ్ బలయ్ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. తెలంగాణ సంప్రదాయాలకు దసరా పండుగ ప్రతీక అని, పార్టీలకు అతీతంగా అందరూ అలయ్ బలయ్‌లో పాల్గొనటం సంతోషమని అన్నారు. 15ఏళ్లుగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని ఆయన అన్నారు. బతుకమ్మ, బోనాలు తెలంగాణ సమాజానికి గౌరవమని, నేటి యువత దేశభక్తి భావనను పెంపొందించుకోవాలన్నారు. భారతదేశం శాంతికి నిలయ మని.. భావి తరాలకు తెలంగాణ సంప్రదాయాన్ని తెలియజేయాలన్నారు. హిమాచల్, తెలంగాణ రాష్ట్రాలకు అనుసంధాన కర్తగా వ్యవహరిస్తానని దత్తాత్రేయ పేర్కొన్నారు.

గవర్నర్‌గా రావటం అదృష్టంగా భావిస్తున్నా – గవర్నర్ తమిళసై

తెలంగాణకు గవర్నర్‌గా రావటం తన అదృష్టంగా భావిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై అన్నారు. తెలుగులో మాట్లాడిన ఆమె అందరినీ ఆశ్చర్య పరిచారు. ప్రజలందరకీ మరొక సారి దసరా శుభాకాంక్షలు చెప్పారు. అలయ్ బలయ్ కార్యక్రమానికి అన్ని పార్టీల వారు రావటం సంతోషకరమని అన్నారు. తనకు బతుకమ్మ పండుగ చాలా బాగా నచ్చిందన్నారు. ఐదు రోజుల పాటు రాజ్‌భవన్‌లో బతుకమ్మ పండుగ నిర్వహించామని చెప్పారు. రాష్ట్రాలు వేరైనా.. తమిళనాడు, తెలంగాణ సంప్రదాయాలు ఒక్కటేనని అన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నానని, ఒక డాక్టర్‌గా చెప్తున్నానని అన్నారు. తెలంగాణలో చిన్న పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని.. పత్రికల్లో చదివానన్నారు. బర్గర్లు, చిప్స్ లాంటి వాటికి పిల్లలను దూరంగా ఉంచాలని గవర్నర్ తమిళసై సూచించారు. దత్తాత్రేయ తనకు మార్గదర్శకులని తమిళసై అన్నారు. గత 15 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని దత్తాత్రేయ గొప్పగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా అందర్నీ ఒక తాటిపైకి తీసుకురావడం గొప్ప విషయమని తమిళిసై అభిప్రాయపడ్డారు.

దేశాభివృద్ధికి ఏకమవ్వాలి – కిషన్‌రెడ్డి

దేశాభివృద్ధికి ప్రజలంతా ఏకమవ్వాలని, మన దేశాన్ని కలిసికట్టుగా, ప్రాంతీయ బేధాలకు తావులేకుండా అభివృద్ధి చేసుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అలయ్‌బలయ్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తుందని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు కోసం ఏకమైనట్లే దేశాభివృద్ధికి కూడా అంతా ఏకమవ్వాలని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి బీజేపీ కృషి చేస్తుందని అన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని ప్రాంతాల అభివృద్ధి చేయడం ద్వారా ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధాని మోదీ తనవంతు కృషి చేస్తున్నారని అన్నారు.

గవర్నర్ తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వటం లేదు – వి. హన్మంతరావు

అలయ్ బలయ్ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ రాజకీయ వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ తమిళిసై అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదంటూ వేదికపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

14 నుంచి హర్యానాలో రాహుల్ ప్రచారం

న్యూఢిల్లీ,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర, హర్యానా శాసనసభల ఎన్నికల పోలింగ్‌కి గడువు ముంచుకొస్తోంది. దీంతో ఎన్నిక ప్రచారాన్ని ముమ్మరం చేశారు నేతలు. రెండు రాష్ట్రాల్లో అధికారం దక్కించుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రచారంలో దూకుడు పెంచింది. ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ 14 నుంచి హర్యానాలో హస్తం అభ్యర్థుల కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.

కన్నుల పండుగగా అమ్మవారి నిమజ్జనం

హైదరాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ప్రపంచ ప్రసిద్ధి చెందిన గణెళిశుడి విగ్రహాన్ని ప్రతి ఏడాది వివిధ రూపాల్లో, రికార్డు స్థాయిలో ప్రతిష్టిస్తున్న ఖైరతాబాద్ గణెళిశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొన్నేండ్లుగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు నిర్వహిస్తూ సుమారు 25 అడుగుల ఎత్తయిన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నారు. అదే పరంపర కొనసాగింపుగా గణెళిశుడి మండపంలోనే దుర్గమ్మను ప్రతిష్టించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి వివిధ అలంకరణలు చేశారు. బుధవారం నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలకరించిన ట్రాలీపై అమ్మవారి విగ్రహాన్ని ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర రాజ్‌దూత్ చౌరస్తా, లుంబినీ పార్కు మీదుగా ట్యాంక్‌బండ్ వద్దగల నిమజ్జన స్థలానికి చేరుకుంది. ఖైరతాబాద్ గణెళిశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి సుదర్శన్, కన్వీనర్ సందీప్ రాజ్, కార్యనిర్వాహక కార్యదర్శి సింగరి రాజ్‌కుమార్ నేతృత్వంలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు

ఘట్‌కేసర్‌లో మంత్రి మల్లారెడ్డి క్యాంప్ కార్యాలయం

హైదరాబాద్,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): ఘట్‌కేసర్ లో మంత్రి మల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించేందుకు కార్యాలయం ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి అన్నారు. ప్రజలకు స్థానికంగా ఉండి సేవలు అందించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఉపయోగకరంగా ఉంటుందని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనం ప్రారంభోత్సవ వేడుకలు దసరా పండుగ రోజు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రితో పాటు జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుధీర్‌రెడ్డితో పాటు నియోజకవర్గ ఎంపీపీలు, జడ్పీటీసీలు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి నిధులు విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 10: తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమానికి నిధులు విడుదలయ్యాయి. రూ.64 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారు. ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి విడుదలైన నిధులు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ మినహా 32 జిల్లాలకు నిధులు విడుదలయ్యాయి.

చరిత్రలో నేటినిజం

కం॥ అమితాభోజ్జ్వలామల నామధేయ-
సమధిక సందంబు నిడుచు సభిమానులకున్-
అమితాభోన్నత శిక్షబడయ-
'అమితాబు'డయంచెను-జనులందరు బాగుడన్!

(అక్టోబర్ 11 'అమితాబ్ బచ్చన్ జన్మదినం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

లెఫ్ట్ పార్టీల దేశవ్యాప్త ఆందోళన

న్యూఢిల్లీ,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనాన్ని వ్యతిరేకిస్తూ లెఫ్ట్ పార్టీలు వారం రోజుల పాటు ఆందోళన చేపట్టనున్నాయి. ఇందులో భాగంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్త నిరసనల్లో ప్రతి ఒకరూ పాల్గొనాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉందని ఆయన ఇటీవల ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఏచూరి చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, వృద్ధాప్య, వితంతువు పెన్షన్లను కనీసం మూడువేలకు పెంచాలని లెఫ్ట్ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇదంతా ప్రపంచీకరణ..

నేటినిజం
శుక్రవారం 11-10-2019

మన ప్రధానమంత్రి న్యూయార్క్‌లో బుధ, గురువారాలలో జరిపిన పెట్టుబడుల సమావేశానికి వివిధ దేశాలకు చెందిన నలబయి వాణిజ్య సంస్థల ప్రతినిధులు హాజరయ్యారట. ఎన్ని వేల లేదా ఎన్ని లక్షల కోట్ల కొత్త పెట్టుబడులు విదేశాల నుంచి మన దేశానికి తరలివస్తాయన్నది మాత్రం ఇతమిత్థంగా వెల్లడి కాలేదు. "రానున్న నెలలలో పెద్దఎత్తున పెట్టుబడులను- మన దేశంలో- పెట్టడానికి అనేక వాణిజ్య సంస్థలు ముందుకు వచ్చాయి..."అని మాత్రమే పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య అభివృద్ధి మంత్రిత్వ విభాగం కార్యదర్శి గురుప్రసాద్ మహాపాత్రా వెల్లడించాడట. ఏళ్లతరబడి మన దేశంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జరుపుతున్న పెట్టుబడుల సమావేశాలలోను, మన ప్రధానులు, ముఖ్య మంత్రులు విదేశాలకు వెళ్లి నిర్వహించిన సమావేశాలలోను "ఇన్ని లక్షల కోట్ల విదేశీయుల నిధులు మన దేశపు పారిశ్రామిక వాణిజ్య రంగాలకు పెట్టుబడులుగా తరలి రానున్నాయి..." అన్న ఆర్భాటపు ప్రచారం జరిగేది. న్యూయార్క్ సమావేశంలో అలాంటి నిర్దిష్ట నిధుల గణాంకాలు ఏవీ నిర్ధారణ అయినట్టు లేదు. ఇలా నిర్ధారణ కాకపోవడం వాస్తవానికి దగ్గరి వ్యవహారం. ఎందుకంటె గత రెండు దశాబ్దుల పెట్టుబడుల సమావేశాలలో "వాగ్దత్తమయిన" విదేశీయ నిధులలో ఎంతశాతం మన దేశానికి తరలివచ్చాయన్న విషయమై కచ్చితమైన గణాంకాలు లేవు. ఎన్ని 'అంగీకారాలు' వాస్తవ రూపం ధరించాయన్నది తెలియరావడం లేదు. ఇలాంటి స్థితిలో వల్ల వేలాది స్వదేశీయ సంస్థలు మూతపడుతున్నాయి. చివరికి ప్రతి రంగంలో రెండు- మూడు- నాలుగు విదేశీయ సంస్థలు మాత్రమే మిగిలే స్థితి దాపురించింది. పంపిణీ రంగంలో 'అమెజాన్', 'వాల్‌మార్ట్' సంస్థలు మాత్రమే వాణిజ్య ఆధిపత్యం వహిస్తుండడం నడుస్తున్న చరిత్ర. ఈ రంగంలో ఈ సంస్థలతో దీటుగా పోటీపడుతున్న స్వదేశీయ సంస్థలు ఉన్నాయా? ప్రభుత్వాలు చెప్పాలి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే! తినుబండారాల రంగంలో 'నెజల్'-నెస్లే-, మరికొన్ని విదేశీయ సంస్థలు 'దోపిడీ' కలాపాలను కొనసాగిస్తున్నాయి, విష రసాయన పూరితమైన తినుబండారాలను మన దేశపు వినియోగదారుల నోళ్లకెత్తుతున్నాయి. మనదేశపు స్థూల జాతీయ ఉత్పత్తి-గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్- జీడీపీ-లో 'సేవల'రంగం వాటా యాబయి ఆరు శాతం కావడం మన ప్రగతి ప్రమాణాలలోని వైచిత్రి. సేవల రంగం ప్రగతి తాత్కాలికమైనది, వౌలికమైనది కాదు. వ్యవసాయ, వౌలిక పారిశ్రామిక రంగాలలో లభించే ప్రగతి నిజమైన ప్రగతి. బ్రిటన్ దురాక్రమణదారులు మన దేశంలోకి చొఱబడే నాటికి ప్రపంచ వాణిజ్యంలో మన దేశపు వాటా నలబయి శాతం. చరిత్ర చెబుతున్న వాస్తవం ఇది. కానీ ప్రస్తుతం ప్రపంచ వాణిజ్య రంగంలో మన వాటా నాలుగు శాతం కూడ లేదు. ఇందుకు ప్రధాన కారణం మన వౌలిక పారిశ్రామిక ఉత్పత్తులు మూడు శతాబ్దులలో క్రమంగా అడుగంటిపోవడం. ఇది మొదటి వైపరీత్యం. రెండవ వైపరీత్యం విదేశాల నుంచి వస్తున్న సంస్థలు వౌలిక పారిశ్రామిక రంగాలలో పెద్దగా పెట్టుబడులను పెట్టడం లేదు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం పెద్దగా అవసరం లేని పంపిణీ రంగంలోకి, సేవల రంగంలోకి ఈ సంస్థలు చొఱబడిపోయాయి. 'బీమా' రంగంలోను, విద్యారంగంలోను విదేశీయ సంస్థల చొఱబాటు కొనసాగుతోంది. విదేశీయ సంస్థలు మన దేశంలో విమానాలను ఉత్పత్తి చేయడం లేదు. కేవలం విమాన సేవలను నిర్వహించడం ద్వారా వినియోగదారులను దోపిడీ చేస్తున్నాయి. ఈ 'దోపిడీ' పేరు "డైనమిక్ ప్రయిజింగ్"! అమెరికాతో 'అణు విద్యుత్' ఒప్పందాలు కుదిరాయి, ఫ్రాన్స్‌తో కుదిరాయి. పదేళ్లు గడిచిపోయినప్పటికీ ఈ దేశాల సంస్థలు ఎందుకని మన దేశంలో అణువిద్యుత్ ఉత్పత్తిచేయడం లేదు? విదేశీయ సంస్థల పెట్టుబడుల మాయాజాలం ఇది. విదేశీయ సంస్థలు మన దేశంలో సిమెంటును, ఉక్కును ఉత్పత్తి చేయడం లేదు. సేమ్యాలను, అప్పడాలను, ఆవకాయలను, శీతల పానీయాలను, రోగాలను పెంచే చాక్లెట్లను తయారు చేస్తున్నాయి. ఇదంతా ప్రపంచీకరణ. ఈ 'ప్రపంచీకరణ'ను ఆరంభించిన అమెరికా ప్రభుత్వమే ఇప్పుడు దీన్ని వదిలించుకొంటోంది. కనీసం ఇప్పటికైనా విదేశీయ సంస్థల 'పెట్టుబడుల' నుంచి విముక్తం చేయాలి!!

బందోబస్తు మధ్య బస్సులను నడిపిన అధికారులు

తిరుగు ప్రయాణాల్లో తప్పని ఇక్కట్లు

ఆదిలాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): సమ్మె నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్టీసీ డిపోలు, బస్టాండ్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్మికులు డిపోలోనికి వెళ్లకుండా, బస్సులను అడ్డుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఆయా డిపోల్లో డీఎస్పీల పర్యవేక్షణలో బందోబస్తు సాగింది. అదేవిధంగా ఆర్టీఏ శాఖాధికారులు సైతం ఆర్టీసీ అధికారులతో చర్చించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా నియమించిన డ్రైవర్లకు డ్రైవింగ్ టెస్టులు నిర్వహించారు. ఆయా ప్రైవేట్ పాఠశాలల బస్సుల యాజమాన్యాలతో ఆర్టీఏ అధికారులు మాట్లాడి వారికి నచ్చిన ప్రాంతాల్లో బస్సులు నడుపుకునేందుకు అవకాశం కల్పించారు. కాగా బస్టాండ్ వైపు వచ్చే ఆయా మార్గాల్లో ఎస్పై స్థాయి అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం రోజుకు రూ.20లక్షల వరకు ఆదాయం వస్తుంది. సమ్మెతో కేవలం రూ.50వేలలోపే ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ డిపో పరిధిలో రోజుకు రూ.16లక్షల 82వేలు, ఉట్నూర్ డిపో పరిధిలో రూ.3లక్షల 70వేలు, ఆదిలాబాద్ డిపో పరిధిలోని తలమడుగు రూట్‌లో రూ.2,200, బోథ్ రూట్‌లో రూ.3వేలు, కరంజి రూట్‌లో కేవలం రూ.500 మాత్రమే ఆదాయం వచ్చింది. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతోనే ఆదాయం తగ్గినట్లు తెలుస్తోంది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగవద్దనే ఆదేశాల మేరకు పాక్షికంగా బస్సులు నడిపించారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. బతుకమ్మ,దసరా పండగలుముగియడంతో పట్టణాలకు వెళ్లాల్సిన వారు ఉదయం నుంచి బస్టాండ్ వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని రూట్లలో మాత్రమే బస్సులు నడపడంతో గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయించారు. దీనిని అదునుగా తీసుకొని ప్రైవేట్ వాహనదారులు అందినకాడికి దండుకుంటున్నారని ప్రయాణికులు వాపోయారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు విద్యాసంస్థలకు దసరా పండగ సెలవులు ఉన్నందున పాఠశాలల బస్సులను కూడా వినియోగించుకునేలా చూడాలన్నారు. ఇకపోతే తాత్కాలిక కండక్టర్ల నుంచి సర్టిఫికెట్లను తీసుకొని వారికి విధులు అప్పగించారు. డ్రైవర్లను ఆర్టీఏ అధికారులతో డ్రైవింగ్‌ను పరిశీలించి బస్సులను అప్పగించారు.

ఇదిలా ఉండగా సమ్మెకు పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, బీజేపీ పార్టీ మద్దతు తెలిపాయి. ఆర్టీసీ సంఘాల నాయకులు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలను చేపట్టారు.

ప్రజలకు సంకటంగా ఆర్టీసీ సమ్మె

హైదరాబాద్, అక్టోబర్ 10:టిఎస్ఆర్‌టిసి కార్మికుల సమ్మె ప్రజలకు ప్రాణ సంకటంలాగా ఉంది. పిల్లికి చెలగాటం వలె ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కఠినంగా అణచివేయడం అన్న ఒక్క చర్యపైనే సర్కార్ దృష్టి సారించిది. దీంతో అతికష్టం మీద గ్రామాలకు వెళ్లిన ప్రజలు తిరుగు ప్రయణాల్లో పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రైవేటీకరణను మనసులో పెట్టుకున్న సిఎం కెసిఆర్ ఇప్పుడు సమ్మెనె సాకుగా చూపి ఆర్టీసీని చక్కదిద్దుతానని ప్రకటించడంలో ఔచిత్యం కనిపించడం లేదు. ఎందుకంటే ఐదేళుగా ఆర్‌టిసి సమస్యలపై ఎక్కడా చిత్తశుద్ధి ప్రకటించిన దాఖలాలు కానరావడం లేదు. అలా అనుకుంటే ఏ సమస్యపైనా సర్కార్ చిత్తశుద్ధితో పని చేయడం లేదు. హైదరాబాద్ రోడ్లను తసీఉకుంటేగతంలో ఎప్పుడూ ఇంత దారుణంగా లేదు. రాజధాని రోడ్లు నరకకూపంగా తయారైనా పట్టింపు లేని తీరు దారుణం కాక మరోటి కాదు. ఆర్టీసీ సమ్మెపై కెసిఆర్ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అహంకారపూరిత వైఖరి దొరతనానికి అద్దం పడుతోంది. చర్చలకు స్వస్తి పలికి, రాజీ ప్రయత్నాలను రద్దు చేసి, తమ అల్టిమేటానికి అనుగుణంగా గడువులోపు విధుల్లో చేరలేదంటూ సుమారు 50 వేల మంది కార్మికులను తొలగించడం నయా నియంతృత్వ పోకడలకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రత్యేక తెలంగానలో ఇంతకన్నా నిరంకుశం మరోటి ఉండదు. ఆర్‌టిసి సమ్మెపై సిఎం కెసిఆర్ నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్ణయాలు ప్రభుత్వ కార్మిక వ్యతిరేకతకు పరాకాష్టగా నిలిచాయి. ఉద్యమ పార్టీ అని చెప్పుకొని అధికారంలోకొచ్చిన కెసిఆర్ స్వయంగా కార్మికుల పట్ల అనుచితంగానే వ్యవహరించారు. సమ్మె చట్ట వ్యతిరేకమని తీవ్ర తప్పిదమని క్రమశిక్షణా రాహిత్యమని ప్రకటించడం ఏ ఉద్యమ లక్ష్యమో చెప్పాలి. బ్లాక్‌మెయిలింగ్ వ్యవహారమని ప్రజా వ్యతిరేకమని గొంతెమ్మ కోర్కెలని నోటికొచ్చినట్లు మాట్లాడారు. కార్మికులతో రాజీ ప్రసక్తే లేదంటూ విధుల్లోకి రాని వారిని తొలగించి ఆ స్థానాల్లో తక్షణం కొత్త నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. అంతటితో ఆగలేదు సరికదా కొత్తగా నియమించేవారి నుంచి తాము ఏ సంఘంలోనూ చేరబోమంటూ విధంగా హామీ పత్రం తీసుకోవాలని హుకుం జారీ చేశారు. సమ్మెను పరిష్కరించాలన్న ప్రతిపక్షాలను తిట్టిపోశారు. కార్మికులపై ప్రజలకు విషాన్ని నూరిపోశారు. కెసిఆర్ నిర్ణయాలు చూస్తుంటే రాజ్యాంగ పరిధిలో పాలన చేస్తున్నారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కొన్నేళ్లుగా సర్కారును అభ్యర్థిస్తున్నారు. నెలల పర్యంతంగా ఆందోళనలు చేసినా ప్రభుత్వంలో ఉలుకు పలుకు లేదు. దాంతో విధి లేక నెల రోజుల క్రితమే కార్మిక సంఘాలు ఆర్‌టిసి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చాయి. అయినా ప్రభుత్వంలో కదలిక లేకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో అక్టోబర్ 5 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళతామని గత నెల 29న నిర్ణయించాయి. ఇకపోతే సమ్మెను అణచివేయాలన్న నిరంకుశ ధోరణిలో తొలగించిన వారి స్థానాల్లో కొత్త నియామకాలకు సిద్ధపడటం కార్మికుల పట్ల ప్రభుత్వ వ్యతిరేకతకు పరాకాష్టగా చెప్పాలి. దసరా,బతుకమ్మలకు పోయే ప్రజలకు సౌకర్యాలు కల్పించి వారిపట్ల నిరంకుశంగా వ్యవహరించి ఉంటే ప్రజలు ప్రభుత్వాన్ని నమ్మేవారు. కానీ అలా జరగలేదు.

ప్రభుత్వ తీరు కారణంగా ప్రజలు నానాయాతన పడుతున్నారు. అతికష్టంమీద ఊరు చేరుకున్న వారికి తిరుగుప్రయాణ కష్టాలు తప్పడం లేదు. వాహనాలు లేవు సరికదా..ఉన్నా అధిక ఛార్జీల మోత మోగిస్తున్నారు. అరకొర ప్రైవేట్ బస్సులు తిప్పి ప్రజలకు కష్టాలు లేవన్న ధోరణి ప్రకటించడం కూడా నిరంకుశ విధానంగానే చూడాలి.

తదుపరి ముగ్గురు ఐఎఎస్‌లతో వేసిన కమిటీ తూతూ మంత్రంగా చర్చలు జరిగాయనిపించడంతో కెసిఆర్ తన విధానాలు ముందుగానే వారితో చెప్పించారు. ముందుగా చెప్పిన విధంగా కార్మికులు సమ్మె బాట పట్టారు. సమ్మె చేస్తామంటున్న కార్మికులతో సుహృద్భావ వాతావరణంలో చర్చలు కొనసాగించాల్సిన సర్కారు, సమ్మె ప్రారంభానికి ఒక్క రోజు ముందే చర్చల కమిటీని ఉన్నపళంగా రద్దు చేయడమే కాకుండా శనివారం సాయంత్రం ఆరు గంటల్లోపు విధుల్లోకి హాజరు కాకపోతే శాశ్వతంగా తొలగిస్తామంటూ రెచ్చగొట్టింది. బాధ్యతాయుతమైన రవాణ శాఖ మంత్రే బెదిరింపులకు పాల్పడ్డారు. గన్‌పార్క్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించబోతే కార్మికులను అరెస్టులు చేయించారు. ఇందిరాపార్క్ వద్ద దీక్షకు పూనుకోగా పర్మిషన్ ఇవ్వలేదు. బస్‌డిపోల వద్ద నిషేధాజ్ఞలు విధించారు. జెఎసి నేతలను, చివరికి మహిళా కండక్టర్లను సైతం గృహ నిర్బంధంలో ఉంచి నిజాం నిర్బంధానికి టిఆర్ఎస్ సర్కారు ఒడిగట్టింది. ఇది ప్రజాస్వామ్యానికే కళంకం. తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాలకు వేడి పుట్టించడానికి ఆనాడు ఆర్‌టిసి, సింగరేణి, తదితర కార్మిక సంఘాలను రెచ్చగొట్టారు. ఇప్పుడు గ్దదెనెక్కాక అసలు స్వరూపం చూపుతున్నారు. ఆర్‌టిసిని ప్రైవేటీకరించే కుట్రతోనే కెసిఆర్ సర్కారు కార్మికుల సమ్మెపై ఉద్దేశపూర్వకంగా కన్నెర్ర చేస్తోంది. అందుకు ఈ రెండు మూడు రోజుల పరిణామాలే ప్రబల ఉదాహరణగా చెప్పాలి. కెసిఆర్ నిర్ణయాలు అన్నీ ప్రైవేటీకరణ ముసుగులో తీసుకున్నవే. నష్టాల నివారణకు ప్రైవేటీకరణెళే మందని బరితెగించి చెబుతోంది. అస్మదీయులకు బస్సులను, తదుపరి రూట్లను ధారాదత్తం చేయాలన్న సర్కారు కుట్ర బయటపడడమే గాకుండా అప్పనంగా ఆర్టీసీ స్థలాలను కొట్టేసే భారీ వ్యూహంకనబడుతోంది. దీనిని ప్రజలు ఉమ్మడిగా ఎదుర్కోవాలి. నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా గట్టిగా ఎదరించాలి.

ఆర్టీసీ సమ్మెతో స్తంభించిన ప్రజారవాణా

ఆరోరోజూ నిరసనల హోరు

దండుకున్న ప్రైవేట్ ఆపరేటర్లు

నిజామాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల సమ్మెతో జిల్లాలో ప్రజా రవాణా స్తంభించగా,ప్రవైట్ ఆపరేటర్లు మా÷-తరం దండిగా సంపాదించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏ సీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆరోరోజుకు చేరుకున్నా కార్మికులు వెనక్కి తగ్గడం లేదు. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ, అవి పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు. ప్రైవేట్ వాహనాల నిర్వాహకులు విచ్చలవిడిగా దోచుకున్నారు. కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ డిపోలుండగా, బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండగలను ముగించుకుని సొంతూళ్లకు వెళ్లే వారు గంటల తరబడి బస్టాండ్లలో పడిగాపులు కాసరు. మరోవైపు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బస్టాండ్లలో 144 సెక్షన్ విధించారు. పోలీసు బందోబస్తు నడుమ కొన్ని బస్సులను తాత్కాలిక డ్రైవర్ల సాయంతో నడిపించారు. డిపోల ముందు కార్మికులు ఆందోళనకు దిగి నిరసనలు వ్యక్తం చేశారు. కెసిఆర్ నిరంకుశ విధానాలపై శాపనార్థాలు పెట్టారు. బస్సులు అడ్డుకునేందుకు యత్నించిన వారిని అక్కడి నుంచి తరిమికొట్టారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రైవేట్ బస్సులు, స్కూల్‌బస్సులు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. బస్సుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఎస్పీ శ్వేత అధికారులకు సూచించారు. కంట్రోల్ రూంతో అనుసంధానం కలిగి ఉండాలన్నారు. సమ్మె నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ఆయా నంబర్లకు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. మరోవైపు బస్సులు లేక బస్టాండ్ నిర్మానుష్యంగా మారింది. ఇక, బాన్సువాడ డిపోలో 85 బస్సులు ఉండ గా, శనివారం 24 బస్సులను నడిపించారు. ఇవి కూడా రద్దీ అధికంగా ఉన్న బిచ్కుంద, బీర్కూర్, నిజామాబాద్ మార్గాలకే ఈ బస్సులను పరిమితం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో రెండు డిపోలకు కలిపి సుమారు రూ.18 లక్షల వరకు ఆదాయం కోల్పోయినట్లు అంచనా. ఇక నిజామాబాద్ రీజియన్ పరిధిలో రూ.80 లక్షల ఆదాయానికి గండి పడింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె ఏమో కానీ ప్రైవేట్ వాహనాలకు కాసుల పంట పండింది. ప్రైవేట్ వాహనాల నిర్వాహకులు విచ్చలవిడిగా దోచుకున్నారు. ఆర్టీసీ టికెట్ కంటే రెండింతలు అధికంగా ప్రయాణికుల నుంచి వసూలు చేశారు. ఆటోలు, టాక్సీలు, మినీ బస్సులు, ప్రైవేట్, స్కూల్ బస్సులను బస్టాండ్ ఆవరణలో నిలిపి ప్రయాణికులను తరలించారు. సమ్మెను ఆసరా చేసుకుని భారీగా దోపిడీ చేసుకున్నారు. టిక్కెట్లు లేకుండా బస్సులు నడిపారు. టికెట్లు ఇవ్వకుండానే డబ్బులు వసూలు చేశారు.

ఆరోరోజుకు చేరుకున్న ఆర్టీసీ సమ్మె

-డిపోల ముందు కార్మికుల నిరసన

కరీంనగర్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం ఆరో రోజుకు చేరుకుంది. కరీంనగర్‌లోని బస్టాండ్లో, వన్, టూ డిపోల ఎదుట కార్మికులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్లకార్డులు చేతబట్టి సమ్మెకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని.. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని.. వేతన సవరణ చేపట్టాలని.. ఉద్యోగ ఖాళీలు భర్తీచేయాలనే.. తదితర 26డిమాండ్లతో సమ్మెకు దిగారు. సర్కార్ తీరును నిరసిస్తూ కార్మికులు సమ్మెను ఉధృతం చేస్తున్నారు. ప్రభుత్వం దిగొచ్చి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాత్కాలిక కండక్టర్లు, డ్రైవర్లను విధుల్లో చేర్చుకొని రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో 10డిపోల్లో 849 ఆర్టీసీ బస్సుల్లో 299 నడిపించారు. అయినప్పటికీ ప్రధాన రూట్లలోనే బస్సులు నడుస్తుండడంతో ప్లలెప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైవర్ల అధిక స్పీడ్‌తో వాహనాలు నడుపుతున్నారని, కండక్టర్లు టికెట్లు ఇవ్వకుండానే ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. సమ్మెను దృష్టిపెట్టుకొని సందట్లో సడేమియాలాగా క్యాబ్‌లు, ఆటోలు ఇష్టానుసారంగా డబ్బులు వసూలుకు పాల్పడుతున్నారు. క్యాబ్ డ్రైవర్లయితే కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్‌కు రూ.300 నుంచి రూ.400 వరకు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. ఇక మారుమూల ప్లలెకు బస్సులు బంద్ కావడంతో ఆటోల హవా కొనసాగుతోంది. రూ.20కి బదులు రూ.50 దాకా చార్జీలు వసూలు చేస్తుండడంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. కార్మికులు డిపోల ఎదురుగా రోడ్డుపై వంటావార్పు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. పట్టణాల్లో ర్యాలీ నిర్వహించారు.

పాలకుల విధానాలకు ఆర్టీసీ బలి

ఆస్తులపై ఉన్న మమకారం కార్మికులపై ఏదీ?

సమ్మెతో సర్కార్ కళ్లు తెరవాలి

హైదరాబాద్,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): ఆర్‌టిసి నష్టాలకు గతం నుంచి ఇప్పటివరకు పాలకులు అనుసరించిన విధానాలే కారణమన్నది అక్షర సత్యం. కేంద్రం ఒక వైపు పెట్రోలియం ఉత్పత్తుల ధరలు, వాటిపై పన్నులు, సుంకాలు పెంచుతుండగా, రాష్ట్రం వ్యాట్, ఎంవి ట్యాక్స్ వంటి వాటిని బాదుతోంది. ప్రైవేటు అక్రమ రవాణాపై లాలూచీపడి నియంత్రణకు తిలోదకాలిస్తోంది. ఆర్‌టిసి ఆస్తులను అమ్ముకుంటోంది. బడ్జెట్ నిధులు ఇవ్వట్లేదు. ప్రభుత్వం తన ఈ ఘోర తప్పిదాలను కప్పెడుతూ, కార్మికులు సంస్థను కాపాడుకునేందుకు సమ్మె చేస్తంటే నిందలు వేయడం దారుణం. వాస్తవానికి కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోర్కెలు కాకున్నా వారిపట్ల నిరంకుశ విధానాలు అవలంబిస్తున్నారు. ప్రభుత్వంలో విలీనం, వేతన సవరణ, ఉద్యోగ భద్రత, కొత్త బస్సుల కొనుగోలు, ఖాళీల భర్తీ, ఇవన్నీ గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలే. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సిఎంగా ఉండగా ఆర్‌టిసిని ముక్కలు చేసి ప్రైవేటీకరించదలిస్తే కార్మికులు ఏకోన్ముఖంగా పోరాడి అడ్డుకున్నారు. ఇప్పుడు కూడా కెసిఆర్ ప్రభుత్వ నియంతృత్వానికి భయపడకుండా కార్మికులు సమ్మెను కొనసాగిస్తుంటే అణచివేత చర్యలను అవలంబించడం సిగ్గుచేటు. ఆర్‌టిసి కార్మికులు కూడా ప్రభుత్వంలో భాగమేనన్న స్పృహతో వారి డిమాండ్లపై టిఆర్ఎస్ సర్కారు స్పందించి ఉంటే బాగుండేది.సమ్మెతో ప్రజల్లో వ్యతిరేకత రావడంతో రాష్ట్రంలో ప్రజలకు ఆర్టీసీ సమ్మె ఎఫెక్ట్ లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారని ప్రకటించడం దారుణం కాక మరోటి కాదు. ఆరోరోజు కూడా సమ్మె ప్రభావం కనిపించకుండా బస్సులు రోడ్లపై తిరిగాయని ప్రకటించు కోవడం చూస్తుంటే మసిపూసి మారేడగాయ చేసే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. పండుగ పూర్తి కావడంతో తిరుగు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టలేకపోయింది. అన్నిరూట్లలో ఎప్పటికప్పుడూ బస్సులు సరిపడా బస్సులను నడుపుతున్నట్లు చెబుతున్నా ప్రజల ఇక్కట్లు గమనిస్తే సర్కార్ ఏర్పాట్లు ఏపాటిగాఉన్నాయో తెలుస్తుంది. మంత్రి పువ్వాడ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ, ఆర్టీఏ, పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అద్దె బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో అధికారులు చర్యలకు దిగుతున్నారు. ప్రయాణికులకు ఆర్టీసీ చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. బస్సులకు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు డిపోల వద్ద ముందస్తు చర్యలు తీసుకున్నారు. అటు భద్రాద్రి కొత్తగూడెం భద్రాచలం, మణుగూరు డిపోల పరిధిలో బస్సులు నడిచాయి. ఖమ్మం, హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఈ ఐదు రోజుల్లో దాదాపు 80 వేల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేశారని చెప్పారు. మొత్తంగా ప్రయాణికులకు మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు.

ఆందోళన బాటలో ఆర్టిజన్ కార్మికులు

ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్

భద్రాద్రి,అక్టోబర్10 (ఆంఎన్ఎ): తెలంగాణా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్‌ల సమస్యలపై కార్మిక సంఘాలు పోరుబాటకు సిద్ధమవుతున్నాయి. జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ తదితర సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 23 వేల మందిని ఆర్టిజన్‌లుగా తీసుకుని రెండేళ్లు గడుస్తున్నా పర్మనెంట్ చేయలేదు. దీంతోపాటు సరైన విధి విధానాలు సైతం ప్రకటించకపోవడంతో కార్మిక సంఘాలు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్ ఫ్రంట్(టీ టఫ్)గా ఏర్పడి ప్రభుత్వంపై ఉద్యమ కార్యాచరణకు రంగం సిద్ధం చేశాయి. రాష్ట్రంలో సుమారు 23 వేల మంది కార్మికులను 2017 జూలై 17న ఆర్టిజన్ కార్మికులుగా తీసుకున్నారు. ఒక్క కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోనే సుమారు 2 వేల మంది కార్మికులు ఉండగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 1,500 మంది కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తించారు. వారిని పూర్తి స్థాయి ఉద్యోగులుగా పరిగణించాలని కోరుతున్నారు. కానీ తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉద్యమ బాటే శరణ్యమని కార్మికులు భావిస్తున్నారు. పోరాడితే తప్ప కార్మిక సమస్యలు పరిష్కారం కావని టీ టఫ్ నాయకులు అంటున్నారు. ఈ క్రమంలో జెన్‌కో, ట్రాన్స్ కో, ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ తదితర సంస్థల కార్మిక సంఘాల నేతలు ఏకమయ్యారు. ఇందులో భాగంగా ఈనెల 11న ఎస్‌పీడీసీఎల్ హన్మకొండ ప్రధాన కార్యాలయం ఎదుట, అక్టోబర్ 16న ఎన్‌పీడీసీఎల్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం ముందు, అక్టోబర్ 23న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే విద్యుత్ ఉత్పత్తి స్తంభించేలా ఉద్యమాలు కొనసాగిస్తామని నేతలు తెలిపారు.

త్వరలో సిఎం కెసిఆర్ జిల్లా పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

నిజామాబాద్,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): నాగమడ

హుజూర్‌నగర్‌లో వేడెక్కిన ప్రచారం

దూసుకుపోతున్న టిఆర్ఎస్,కాంగ్రెస్ గెలుపుపై ధీమాలో గులాబీ శ్రేణులు

నూర్యాపేట,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): హుజూర్ నగర్ ఉప ఎన్నికలో ప్రచార మోరు వేడెక్కింది. ఓ వైపు కాంగ్రెస్,మరోవైపు టిఆర్ఎస్ ప్రచారంలో దూసుకుని పోతున్నాయి. ఇతరపార్టీలు బరిలో ఉన్నా, ఈ ఇద్దరిమధ్యే పోటీ ప్రధానంగా కనిపిస్తోంది. గడపగడపకు ప్రచారంతో టీఆర్ఎస్ దూసుకుపోతున్నది. మంత్రి జగదీశ్వర్ రెడ్డి పక్కా వ్యూహంతో గ్రామాలను చుట్టి వస్తున్నారు. హుజూర్ నగర్ ఉప ఎన్నికల ఇంఛార్జ్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఇతర నాయకులు కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి కూడా గ్రమాల్లో ప్రజలను నేరుగా కలుస్తూ తనకే ఓటేయాలని కోరుతున్నారు. స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటూ టీఆర్ఎస్ కే జై కొడుతున్నారు. డప్పు దరువులు, జై టీఆర్ఎస్ నినాదాలతో ప్రచాంహోరు జాతరను తలపిస్తున్నది. హుజూర్ నగర్ ఉప ఎన్నికల నేపథ్యంలో టీఆర్ఎస్ లోకి వలసలు వెల్లువెత్తు తున్నాయి. పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు భారీగా గులాబీ కండువా వేసుకున్నారు. మంత్రి జగదీశ్ రెడ్డి వాళ్లందరికీ టీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. తండా లవాసులంతా మూకుమ్మడిగా టీఆర్ఎస్ కే సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. నమ్ముకున్న హుజూర్ నగర్ ప్రజలను.. ఉత్తమ్ నట్టేట ముంచాడని మంత్రి జగదీశ్వర్ రెడ్డి ప్రచారంలో విమర్శలు గుప్పిస్తున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. హుజూర్ నగర్ లో ఒక్కసారి టీఆర్ఎస్ కు అవకాశం ఇస్తే.. అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామన్నారు. ఈ ప్రచారంలో టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి, ఎమ్మెల్యేలు స్థానిక నేతలు పాల్గొంటున్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఈ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డినే గెలిపించుకుంటారని మంత్రి ధీమాగాఉన్నారు. హుజూర్ నగర్ గడ్డపై గులాబీజెండాను రెపరెపలాడించి కొత్త చరిత్రను సృష్టిస్తామంటున్నారు. ఇకపోతే కాంగ్రెస్ కూడా పరచారంలో ముందున్నది. పార్టీనేతలు ఉత్తమ్, విహెచ్, కోమటిరెడ్డి తదితరులు ప్రచారంలో దూసుకుని పోతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు: జెసి

జగిత్యాల,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మెతో ప్రజలకు ఇబ్బందులు రాకుండా జిల్లాలో మొత్తం 206 బస్సులకుగాను 188 బస్సులను నడుపుతున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.రాజేశం తెలిపారు. ప్రతి డిపోలో ఒక డీఎస్పీ స్థాయి అధికారి బందోబస్తు పర్యవేక్షిస్తున్నారన్నారు. అదే విధంగా డిపోల్లో రెవెన్యూ శాఖ ద్వారా ప్రతి డిపోలో ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లను, ఆర్ఐ, వీఆర్వోలను నియమించి పనులు చేయిస్తున్నామన్నారు. జిల్లాలోని మూడు డిపోలో పోలీస్ సిబ్బందితో పాటు డీఎస్పీ ర్యాంక్ అధికారిని పర్యవేక్షణ కోసం నియమించామన్నారు. బస్టాండ్ లో వీడియోగ్రఫీని ఏర్పాటు చేశామన్నారు. డిపో నుంచి బస్సు రూట్లలో పెట్రోలింగ్ కూడా నిర్వహించామని తెలిపారు. డిపో మేనేజర్ ఆర్టీఏ వారితో పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమీక్షిస్తామన్నారు. ఆర్టీసీ ద్వారా నడుస్తున్న బస్సుల్లో అదనంగా ఛార్జీలు వసూలు చేస్తే సంబంధిత తాత్కాలిక ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెను పురస్కరించుకుని ప్రత్యామ్నయ ఏర్పాట్లలో అధికారులందరూ తమవంతుగా ఒక టీమ్ వర్క్ విధులు నిర్వహిస్తున్నారన్నారు. తిరుగు ప్రయాణాలను పురస్కరించుకుని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రవాణా సదుపాయం ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రజలు వారి గమ్యస్థానాలు చేరుకోవడానికి తమవంతుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా నియమింపబడిన డ్రైవర్లు, కండక్టర్లు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీతారామ ప్రాజెక్టుపనులు వేగవంతం

నిధుల కేటాయింపుతో చురకుగా పనులు

ఖమ్మం,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి.. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు రూ.1,324కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణ పనులు కొనసాగుతుండగా.. బ్జడెట్‌లో కేటాయించిన నిధులతో పనులు వేగవంతమయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు భావిసున్నాయి. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టుల మరమ్మతులు, నిర్వహణకు సంబంధించి సైతం ఈ దఫా బ్జడెట్‌లో నిధులు కేటాయించింది. వైరా ప్రాజెక్టు పరిధిలో మరమ్మతు, పనుల నిర్వహణ కోసం రూ.23.50కోట్లు కేటాయించగా.. తాలిపేరు ప్రాజెక్టుకు రూ.3కోట్లు, అశ్వారావుపేట పరిధిలోని పెద్దవాగు ప్రాజెక్టుకు రూ.3.20కోట్లు, పాల్వంచ మండలంలోని కిన్నెసాని ప్రాజెక్టుకు రూ.10కోట్ల ను బ్జడెట్‌లో కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగునీటి రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు టీఆర్ఎస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిధులు పూర్తిస్థాయిలో సరిపోవని, సీతా రామ ప్రాజెక్టు నిర్మాణానికి బ్జడెట్‌లో మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని, ఈ మాత్రం నిధులతో పనులు వేగవంతం ఎలా అవుతా యని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. అయితే ప్రాధాన్యతా క్రమంలో జిల్లాకు సంబంధించి ప్రాజెక్టులకు కేటాయించిన నిధులను ప్రభుత్వం త్వరితగతిన విడుదల చేస్తే ఆయా ప్రాజెక్టుల పరిధిలోని పనులు వేగవంతమయ్యే అవకాశం ఉందని రైతు వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధుల్లో రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా పథకాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో జిల్లాలోని అనేక మంది రైతులు ఈ పథకాల వల్ల ప్రయోజనం పొం దనున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు పథకాల కొనసాగింపునకు ప్రాధాన్యం ఇవ్వడం తోపాటు ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులు కేటాయించింది. ఆసరా పెన్షన్లు, పేదల సంక్షేమానికి సంబంధించి వసతి గృహాల నిర్వహణ, వికలాంగుల పెన్షన్ వంటి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించడంతో జిల్లాలో ఆయా రంగాల వారికి ప్రయోజనం కలగనున్నది. ఒకవైపు దేశవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం తరుముకొస్తున్నా.. సంక్షేమ రంగాలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రాధాన్యం యథావిధిగా కొనసాగిస్తూ.. ఆయా రంగాలకు బ్జడెట్‌లో పెద్దపీట వేశారు.

సరిహద్దుల్లో డ్రోన్లు

– అప్రమత్తమైన భద్రతా బలగాలు

జమ్మూకశ్మీర్, అక్టోబర్10 (ఆర్ఎన్ఎ) : పాక్ బుద్ధి మారట్లేదు. ఎన్ని దెబ్బలు తగిలినా.. ఎన్ని చివాట్లు తిన్నా.. తీరు మార్చుకోవట్లేదు. కుక్క తోక ఎప్పటికీ వంకరే అన్నట్లుగానే ఉంటోంది. అటు పంజాబ్ సరిహద్దుల్లో డ్రోన్‌లతో వక్రబుద్ధి చూపిసూనే... ఇటు సరిహద్దులో కాల్పులకు తెగబడుతున్నారు. నిబంధనలు అతిక్రమించి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. తాజాగా గురువారం పంజాబ్ సరిహద్దుల్లో మరోసారి పాక్ డ్రోన్లు కలకలం రేపాయి. సెప్టెంబర్ చివర్లో తొలిసారి భారత భూభాగంలోకి ప్రవేశించిన డ్రోన్లు... మరోసారి ఫిరోజ్‌పూర్‌లో మూడురోజుల నుంచి తిరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఆరు పాక్ డ్రోన్లు భారత భూభాగంలో చక్కర్లు కొట్టడాన్ని స్థానిక ప్రజలుసైతం గమనించారు. అయితే మూడు రోజులుగా చక్కర్లు కొడుతున్న డ్రోన్లు... ఫిరోజ్‌పూర్ సరిహద్దుల్లో కూలిపోయి ఉంటాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో డ్రోన్ శకలాల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు డ్రోన్ల ద్వారా ఉగ్రమూకలకు డ్రగ్స్, మందుగుండు సామగ్రి సరఫరా చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఉగ్రవాదులకు సహాయం అందిం చేందుకు పాక్ పలు ప్రయత్నాలు చేస్తోంది. గడిచినవారం రోజుల్లో డ్రోన్లను భారత భూభాగంలోకి ప్రవేశింప చేశారు. డ్రోన్ల ద్వారా పది కేజీల బరువు ఉండే గన్లు, మందుగుండు సామాగ్రిని ఉగ్రవాదులకు చేరవేస్తున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. మరోవైపు అవింతిపూర, పూంచ్ తదితర ప్రాంతాల్లో పాక్ కాల్పులకు దిగుతోంది. భారత్‌లోకి 60మంది ఉగ్రవాదులు చొరబడ్డారని నిఘా విభాగం హెచ్చరికలు చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం, యరుగండ్లపల్లి సమీపంలో ఓ కారు యాక్టివా బైకును ఢీకొన్న దృశ్యం

నల్గొండ,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): జిల్లాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.

మర్రిగూడ మండలం, యరుగండ్లపల్లి సమీపంలో ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్ పైనున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వేగంగా వస్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పైనున్న భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిరువురి కాళ్లు విరిగి, తీవ్ర రక్త స్రావమవగా.. వారిని 108 అంబులెన్సులో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు

జిల్లా వ్యాప్తంగా 70 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

15 తరవాత కొనుగోళ్లకు అవకాశాలు

రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు

నల్లగొండ,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లను అక్టోబర్ 15 తర్వాత కొనుగోళ్లు చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 70 కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా కేంద్రాల్లో ఈ కొనుగోళ్లను చేపట్టనున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 40 ఐకేపీ కేంద్రాలు, సహకారశాఖ ఆధ్వర్యంలో 30పీఏసీఎస్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతా ల్లో ధాన్యం ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని సమీప గ్రామాల నిడివిని పరిశీలిస్తూ ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ కేంద్రాల ఏర్పాటుపై శుక్రవారం జేసీ చంద్రశేఖర్ సంబంధిత శాఖల అధికార యంత్రాంగంతో సమీక్షించారు. అక్టోబర్ 15 తర్వాత ధాన్యం ఉత్పత్తిని బట్టి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ చేయనున్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 70 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర అందించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం వస్తే కొనుగోలు చేయొద్దని, ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. 70 కేంద్రాల ద్వారా 3.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. నన్న ధాన్యం రైతులు ఎక్కువగా పండించనున్న నేపథ్యంలో క్వింటాకు ఏ గ్రేడ్ అయితే రూ.1,835, సాధారణ రకమైతే

రూ. 1,815 చెల్లించేందుకు నిర్ణయించి వచ్చే నెల 15 తర్వాత జిల్లా వ్యా ప్తంగా 70 కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. అదేవిధంగా సాధారణ రకం ధాన్యానికి గత సంవత్సరం రూ.1750 ఇవ్వగా క్వింటాకు ఈ ఏడాది రూ. 1815 చెల్లించనున్నారు. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలో గుర్తించిన మిల్లులకు పంపించిన అనంతరం సివిల్ సప్లయ్ ఆధ్వర్యం లో రైతులకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను చెల్లించనున్నారు. అయితే ఆయా కొనుగోలు కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ కాంటాలు, టార్పాలిన్లు, తేమ యంత్రాలు మార్కెటింగ్‌శాఖ సమకూర్చనుండగా గన్నీబ్యాగ్‌లు, ధాన్యం రవాణ నిర్వహణ సివిల్ సప్లయ్ యంత్రాంగం చేపట్టనుంది. జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం వానాకాలంతో పోలిస్తే ఈసారి ధాన్యం ఉత్పత్తి సుమారు 50వేల మెట్రిక్ టన్నులకు పైగా పెరుగనుంది. గత సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 76వేల హెక్టార్లలో వరి సాగు కాగా 2.70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తయింది. ఈ ఏడాది ఇప్పటికే 90వేల హెక్టార్లకు పైగా వరిసాగు కాగా ఈ వారం రోజుల్లో మరికొంత పెరిగే అవకాశమున్నట్లు వ్యవసాయశాఖ యంత్రాంగం చెబుతోంది. దీని ప్రకారం ఈ సీజన్లో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది.

కర్నాటక మాజీ డిప్యూటీ సీఎం ఇంట్లో ఐటీ సోదాలు

బెంగళూరు, అక్టోబర్10 (ఆర్ఎన్ఎ) : కర్నాటక మాజీ డిప్యూటీ సీఎం జీ పరమేశ్వర నివాసాల్లో గురువారం ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. సుమారు 30 ప్రదేశాల్లో ఐటీ శాఖ తనిఖీలు జరిపారు. పరమేశ్వరకు చెందిన ట్రస్టు ఓ మెడికల్ కాలేజీని నిర్వహిస్తున్నది. ఆ కాలేజీలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఐటీశాఖ దాడులు చేస్తున్నట్లు సమాచారం. సిద్దార్థ గ్రూప్ ఆఫ్ ఇన్స్‌టిట్యూషన్స్ ఓనర్ పరమేశ్వర. అయితే తుమకూరులో ఉన్న ఆ విద్యాసంస్థలో నలుగురు సభ్యుల ఐటీ బృందాలు సోదాలు చేస్తున్నట్లు తెలిసింది. ఐటీ దాడులను కర్నాటక ప్రతిపక్ష నేత సిద్దరామయ్య ఖండించారు. రాజకీయ దురుద్దేశంతో ఈ దాడులు చేసినట్లు ఆరోపించారు. తన ఆఫీసులపై జరుగుతున్న దాడుల పట్ల పరమేశ్వర స్పందించారు. అయితే దాడుల గురించి తనకు తెలియదన్నారు. ఎక్కడ దాడులు జరుగుతున్నాయో తనకు ఎటువంటి సమాచారం లేదన్నారు. ఐటీ సోదాలు చేసినా తనకేమీ ఇబ్బందిలేదన్నారు. తన నుంచి ఎటువంటి తప్పిదం ఉన్నా.. దాన్ని సరిచేసుకుంటామని పరమేశ్వర తెలిపారు.

తీహార్ టూరిజంతో జైలును పరిశీలించే ఛాన్స్

త్వరలోనే అందుబాటులోకి సరికొత్త కార్యక్రమం

న్యూఢిల్లీ,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): తీహార్ జైలు కార్యకలాపాలను నేరుగా చూడాలనుకునే వారికి ఓ అవకాశం రాబోతున్నది. ఈ మేరకు జైలు అధికారులు జైల్ టూరిజం ప్రవేశ పెట్టే యోచనలో ఉన్నారు. ఈ మేరకు త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకావం ఉంది. జైలు జీవితం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవాలని చాలా మందికి ఆసక్తి ఉంటుంది. కారాగారంలో ఖైదీల జీవనం ఎలా ఉంటుంది? కరుడుగట్టిన తీవ్రవాదులు జైలులో ఎలా ఉంటారు? వీటన్నింటినీ తెలుసుకోవడంతోపాటు నేరగాళ్లను ప్రత్యేక్షంగా చూడటానికి ఆసియాలోనే అతిపెద్దదైన తీహార్ జైలు సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టబోతుంది. 'తీహార్ టూరిజం' పేరుతో జైలు చూడాలనే ఆసక్తి ఉన్న సందర్శకులకు అనుమతి ఇవ్వనుంది. దీంతో సందర్శకులు జైలులో ఉండే ఖైదీలను, వారు రోజువారిగా చేసే పనులను, జైలు పరిసరాలను ప్రత్యక్షంగా చూడవచ్చని తీహార్ జైలు అధికారులు తెలిపారు. జైలును సందర్శించి,అక్కడే ఒక రోజుకు పాటు ఖైదీలతో ఉండాలనే ఆసక్తి ఉన్న సందర్శకులకు రూ.500 సాధారణ ఫీజుతో అనుమతి ఇవ్వడానికి కారాగార ఉన్నతాధికారులు నియమ నిబంధనలను రూపొందిస్తున్నారు. 'సందర్శకులు జైల్లో ఇతర ఖైదీలు ఉన్నట్టుగానే సాధారణంగా ఒక రోజు వారితో జైలు గదిలో ఉండాలి. నేలపైనే నిద్రించాలి. ఉదయాన్నే లేచి వంట చేసుకోవాలి. తమ ప్రాంగణాన్ని శుభ్రపరచాలి. యోగా, ధ్యానం, పెయింటింగ్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలి. సందర్శకులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం జరుగుతుంది. ముఖ్యంగా జైలు లోపలికి సెల్‌ఫోన్‌లను అనుమతించబోమని' తీహార్ జైలు ఉన్నతాధికారి తెలిపారు. కాగా ఖైదీల ప్రవర్తన ఆధారంగా మంచి వారిని మాత్రమే సందర్శకులతో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ఖైదీలకు ఎటువంటి ఇబ్బందులు కలించరనే నమ్మకం ఉన్న సందర్శకులకు మాత్రమే జైలును సందర్శించే అనుమతి కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో 16వేల మంది ఖైదీలున్న తీహార్ జైలు దేశంలో ఉన్నపెద్ద కారాగారం అన్న విషయం తెలిసిందే. ఇటువంటి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రం నిసంగారెడ్డిలో 'ఫీల్ ద జైల్' పేరుతో కారాగాన్ని సందర్శించి అక్కడే ఒక రోజుపాటు ఖైదీలతో ఉండే అవకాశాన్ని జైలు ఉన్నతాధికారులు కల్పిస్తున్న విషయం తెలిసిందే.

పక్కాగా ధాన్యం కొనుగోళ్లు

జనగామ,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): ధాన్యం కొనుగోళ్లను ఈసారి మరింత పటిష్టంగా, పక్కాగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఓజే మధు అధికారులను ఆదేశించారు.ఈ మేరకు ఐకేపీ, పీఏసీఎస్ అధ్యక్షులు, రైతు సమన్వయ సమితి సభ్యులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు సహా వివిధ ప్రభుత్వశాఖల అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వరంగ సంస్థల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఈసారి ప్రతి కొనుగోలు కేంద్రానికి వ్యవసాయశాఖ నుంచి ఒక ఏఈవోను నియమిస్తున్నామని చెప్పారు. రైతులకు సంబంధిత అధికారి ధాన్యం కొనుగోలు అంశంలో అన్ని విధాలుగా అవగాహన కల్పిస్తారని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని సకాలంలో కొనుగోలు కేంద్రానికి తరలించాలని సూచించారు. ఈవోలు ధాన్యం నాణ్యతను పరిశీలించి రైతులకు తెలియజేస్తారని, తేమశాతం ఎక్కువగా ఉంటే ఆరబెట్టుకోవడం వంటి సూచనలు చేస్తారని చెప్పారు. ధాన్యం సేకరణలో అధికారులతోపాటు అన్నిస్థాయిల ప్రజాప్రతినిధులు భాగస్వాములుగా ఉంటూ జిల్లాను ముందు వరుసలో నిలపాలని కోరారు. కౌలు రైతులకు డబ్బుల చెల్లింపులో తహసీల్దార్, ఏఈవో నుంచి ధ్రువపత్రాన్ని తీసుకొని అందజేయాలని చెప్పారు.

చెరువులకు గోదావరి జలాలు

–ఎమ్మెల్యే రాజయ్య వెల్లడి

జనగామ,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): చెరువులను డిసెంబరు వరకు గోదావరి జలాలతో నింపియాసంగి పంటకు సాగునీరును అందిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. వివిధ గ్రామాల్లో నీరులేని చెరువులకు గోదావరి జలాలను అందిస్తామని అన్నారు. ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. లింగాలఘనపురం మండలంలోని అన్ని చెరువులను మూడు కాలువల ద్వారా గోదావరి జలాలతో చెరువులను నింపుతున్నామ న్నారు. ఒక కాలువ ద్వార నవాబుపేట రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు చేరుకుంటున్నాయన్నారు. ఈ క్రమంలో వనపర్తి చెరువు మత్తడి పోస్తుండగా, కొత్తపెల్లి చెరువు అలుగుకు సిద్ధంగా ఉందన్నారు. నేలపోగుల, వడిచర్ల, కొత్తపెల్లి, గుమ్మడవెల్లి చెరువుల్లోకి గోదావరి జలాలు చేరుతున్నాయన్నారు. మరో కాలువ ద్వారా చీటకోడూరు రిజర్వాయర్ నుంచి మండలంలోని మాణిక్యపురం, నాగారం, క్లశెం చెరువులను నింపి 1285 ఎకరాలకు సాగు నీరందించేందుకు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. మూడో కాలువైన అశ్వరావుపెల్లి ప్రధాన కాలువకు కొంతమంది రైతులు అడ్డుకోవడంతో పనులు నిలిచాయన్నారు.వచ్చే ఏడాది మార్చి లోగా ఈ కాలువ ద్వార నీరందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారని, వాస్తవానికి డిసెంబరు వరకే పూర్తి చేయించేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకవస్తున్నామన్నారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు సీఎం జగన్‌తో చిరు భేటీ

హైదరాబాద్, అక్టోబర్10(ఆర్ఎన్ఎ) : మెగాస్టార్ చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌తో భేటీకానున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు అమరావతిలో సీఎంతో చిరంజీవి, రామ్‌చరణ్‌లు సమావేశంకానున్నారు. కొద్దిరోజుల క్రితం చిరు సీఎం జగన్ అపాయిట్‌మెంట్ కోరారట.. ఈ మేరకు సీఎంవో గురువారం అపాయింట్‌మెంట్ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. జగన్‌తో సైరా సినిమా గురించి చర్చించనున్న మెగాస్టార్.. సినిమా చూడాలని సీఎంను కోరబోతున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక జగన్‌తో చిరంజీవి తొలిసారిగా సమావేశంకాబోతున్నారు.

సైదిరెడ్డి గెలుపు ఖాయం: గోపగాని

హుజూర్‌నగర్,అక్టోబర్10 (ఆర్ఎన్ఎ): హుజుర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిగెలుపు ఖాయమని జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ గోపగాని నారాయణ అన్నారు. ఆయన వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని అన్నారు. టీఆర్ఎస్ గెలిస్తే హుజుర్‌నగర ప్రజలకు లాభమనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లామని అన్నారు. టీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటువేసి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరారు

నేను గెలిస్తే నో ట్రాఫిక్ చలాన్..!

– బీజేపీ అభ్యర్థి దుదారాం హామీ

చండీఘర్, అక్టోబర్10(ఆర్ఎన్ఎ) : ఎన్నికలకు వచ్చాయంటే ఓటర్లను ఆకట్టుకోవడానికి.. ప్రజలను బుట్టలో వేసుకోవడానికి రాజకీయ నేతలు, ఎన్నికల్లో పోటీకి దిగిన అభ్యర్థులు హామీలు కురిపించడం పరిపాటి. అయితే హర్యానా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిటిచన ఓ అభ్యర్థి.. మరీ అప్‌డేట్‌గా ఆలోచించారు.. మీరు నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే ట్రాఫిక్ చలాన్ లేకుండా చేస్తానంటూ హామీ ఇచ్చారు. 90 మంది ఎమ్మెల్యే స్థానాలున్న హర్యానా అసెంబ్లీకి ఈ నెల 21వ తేదీన పోలింగ్ జరగనుండగా.. 24వ తేదీన ఫలితాలు ప్రకటించనున్నారు. అయితే, బీజేపీ తరపున ఎన్నికల బరిలోకి దిగాడు దుదారాం బిష్ణోయ్.. ఎన్నికల ప్రచారసభలో ఆయన మాట్లాడుతూ.. మీరు నన్ను ఈ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే.. ప్రజలను పట్టి పీడిస్తున్న డ్రగ్స్, నిరక్షరాస్యతను నిర్మూలిస్తా.. ట్రాఫిక్ చలాన్స్ ఇబ్బందిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా, జులైలో పార్లమెంటు ఆమోదించిన మోటారు వాహనాల (సవరణ) బిల్లు 2019 సెప్టెంబర్ 1 నుండి అమల్లోకి రాగా.. భారీ చలాన్లతో వాహనదారులు చుక్కలు చూస్తున్నారు. అయితే, మొత్తానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం భారీ జరిమాలు విధిస్తుండగా.. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న వ్యక్తి మాత్రం ఇలాంటి హామీ ఇవ్వడం చర్చగా మారింది.

పుణె టెస్టులో నిరాశ పరిచిన రోహిత్

కేవలం 14 పరగులకే ఔటయిన డ్యాషింగ్ ఓపెనర్

50 టెస్టుల కెప్టెన్‌గా ఘనత సాధించిన కోహ్లీ

పుణె,అక్టోబర్10(ఆర్ఎన్ఎ): దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండవ టెస్టులో రోహిత్ శర్మ అభిమానులను నిరాశపరిచాడు. తొలి టెస్టులో అదరగొట్టిన రోహిత్ పుణెలో మాత్రం రాణించలేకపోయాడు. . వైజాగ్‌లో జరిగిన తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలతో అలరించిన రోహిత్.. పుణె టెస్టులో మాత్రం స్వల్ప స్కోరుకే పెవిలియన్‌కు చేరుకున్నాడు. రోహిత్ కేవలం 14 పరుగులు చేసి రబడ బౌలింగ్‌లో క్యాచ్ ఔటయ్యాడు. భారత్ పది ఓవర్లలో వికెట్ నష్టానికి 25 రన్స్ చేసింది. మరో ఓపెనర్ మయాంక్ నిదానంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. వన్‌డౌన్‌లో పుజారా క్రీజ్‌లోకి వచ్చాడు. అంతకముందు టాస్ గెలిచిన భారత్.. మొదట బ్యాటింగ్ ఎంచుకున్నది. హనుమ విహారీ స్థానంలో ఉమేశ్ యాదవ్‌ను తీసుకున్నారు. ఈ టెస్టుతో కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. భారత జట్టు తరపున టెస్టుల్లో 50 మ్యాచ్‌లకు కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన ప్లేయర్‌గా ఘనత సాధించాడు. దక్షిణాఫ్రికాతో పుణెలో జరుగుతున్న రెండవ టెస్టుతో కోహ్లీ ఈ రికార్డును అందుకున్నాడు. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ గతంలో ఈ మైలురాయిని దాటాడు. ధోనీ మొత్తం 60 టెస్టులకు సారథ్య బాధ్యతలు వహించాడు. 2008 నుంచి 2014 మధ్య ధోనీ .. టెస్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 49 మ్యాచ్‌లతో మూడవ స్థానంలో సౌరవ్ గంగూలీ ఉన్నాడు. భారత్ తరపున ప్రాతినిధ్యం వహించడం అదృష్టంగా భావిస్తున్నట్లు కెప్టెన్ కోహ్లీ తెలిపాడు. ఇదో చిన్న మైలురాయి, కానీ తన ఫోకస్ మొత్తం మ్యాచ్ గెలుపుమీదే ఉందని విరాట్ చెప్పాడు.

తన క్రికెట్ కెరీర్‌లో జరిగిన ప్రతి అంశానికి కృతజ్ఞతను తెలియజేస్తున్నట్లు కోహ్లీ చెప్పాడు. టీమిండియా సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా కోహ్లీకి గుర్తింపు ఉన్నది. అతని సారథ్యంలో ఇండియా ఇప్పటివరకు 29 టెస్టుల్లో నెగ్గింది. మరో పది మ్యాచ్‌లు డ్రా కాగా, ఇంకా పది మ్యాచ్‌ల్లో ఓడిపోయారు. కోహ్లీ సారథ్యంలోనే టీమిండియా ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ విజయాన్ని నమోదు చేయడం విశేషం. కెప్టెన్‌గా కోహ్లీ గెలుపు-ఓటమి శాతం 2.9గా ఉన్నది. ఆస్ట్రేలియా కెప్టెన్లు స్టీవ్ వా, రికీ పాంటింగ్ తర్వాత కోహ్లీనే ఉన్నాడు.

'భూల్ భులయ్యా 2'లో కియారా అద్వానీ

భయం భయంగా ఓ గదిలోకి అడుగులు వేస్తున్నారు కియారా అద్వానీ. ఆ భయం వెనక ఉన్న నిజాన్ని కనిపెట్టడానికి ఆమెను వెంబడిస్తున్నారట కార్తీక్ ఆర్యన్. ఇంతలో పెద్ద శబ్దం వచ్చిందట. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. అనీస్ బాజ్మీ దర్శకత్వంలో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'భూల్ భులయ్యా 2'. 2007లో అక్షయ్ కుమార్ నటించిన 'భూల్ భులయ్యా' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. కార్తీక్, కియారాలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 'కొత్త ప్రయాణం మొదలైంది' అన్నారు కియారా అద్వానీ. 'భూల్ భులయ్యా 2' చిత్రం వచ్చే ఏడాది జూలైలో విడుదల కానుంది. మరోవైపు హిందీ చిత్రాల ('లక్ష్మీబాంబ్, షేర్షా, ఇందూ కీ జవానీ') షూటింగ్‌లతో పాటు 'గిల్టీ' అనే వెబ్‌సిరీస్‌తో కియారా ప్రస్తుతం మస్త్ బిజీ బిజీగా ఉన్నారు.

బాలయ్యకు జంటగా తమన్నా...?

నందమూరి అందగాడు బాలకృష్ణ వరసగా సినిమాలు చేసుకుంటూ పోతున్నాడు. సీనియర్ మోస్ట్ హీరో అయినా కూడా ఆయన ఎనెర్జీ లెవెల్స్ ఎక్కడా తగ్గలేదు. ఈ ఏడాది ఇప్పటికే కథానాయకుడు, మహానాయకుడు సినిమాలు రిలీజ్ చేసిన బాలయ్య ఇదే ఏడాది చివర్లో రూలర్ మూవీని థియేటర్లకు తెస్తున్నాడు. ఈ మూవీని డిసెంబర్ 20న అనుకుంటున్నారు. జూన్ లో ప్రారంభమైన ఈ మూవీకి సంబంధించి షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చిందంట. అంటే. బాలయ్య ఎంత స్పీడ్ గా మూవీస్ చేస్తాడో అర్థం చేసుకోవాలి. ఇదిలా ఉండగా ఈ మూవీ తరువాత సినిమా 106 ని కూడా బాలయ్య లైన్లో పెట్టాడు, ఈ మూవీని టాప్ డైరెక్టర్ బోయపాటి శ్రీను డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీతో బాలయ్య బోయపాటి హ్యాట్రిక్ సక్సెస్ కొట్టాలనుకుంటున్నారు. ఈ మూవీలో రెండు క్యారక్టర్లు ఉంటాయట. ఒకటి యంగ్ క్యారక్టర్ దాని కోసం బాలయ్య ఇప్పటికే బాగా తగ్గి స్లిమ్ గా తయారయ్యాడు. ఇక యంగ్ క్యారక్టర్ పక్కన మిల్కీ బ్యూటీ తమన్నాని తీసుకోవాలనుకుంటున్నట్లుగా టాక్ నడుస్తోంది. ఈ మూవీలో మరో ఇద్దరు హీరోయిన్లు కూడా ఉంటారని అంటున్నారు. మొత్తానిక్ గ్లామర్ తో ఫుల్ గా ఈ మూవీని నింపేయాలన్నది బోయపాటి మార్క్ ఆలోచనగా కనిపిస్తోంది. ఇక ఈ మూవీలో తమన్నా బాలయ్యతో జత కడుతోందన్న వార్తలు ఫ్యాన్స్ కి ఖుషీ చేస్తున్నాయి.

ఇప్పటికే తమన్నా ఎఫ్ 2లో వెంకీ పక్కన నటించింది. తాజాగా రిలీజ్ అయిన సైరా మూవీలో మెగాస్టార్ పక్కన కూడా నటించింది. ఇక కొరటాల మెగాస్టార్ మూవీలో కూడా తమన్నా ఓ హీరోయిన్ అని అనుకుంటున్నారు. ఇపుడు బాలయ్యతో నటించడం ఖరారు అయితే ఒక్క నాగార్జున తప్పసీనియర్ హీరోలందరి సరసనా నటించిన క్రెడిట్ తమన్నా సొంతం అవుతుంది. మరి నాగ్ తో సైతం తమన్నా నటించేందుకు రెడీగా ఉందని అంటున్నారు. ఆ విధంగా చూస్తే అటు యంగర్ జనరేషన్, ఇటు సీనియర్ హీరోల పక్కన మెరిసిన తారగా తమన్నా రికార్డు స్రుష్టించినట్లేమరి.

పోలవరం పూర్తికావాలన్నదే మా ధ్యేయం

- ఆమేరకు అవసరమైన చర్యలు చేపడతాం

- నేడు ప్రాజెక్టును సందర్శించి పనుల తీరు, ప్రగతి పరిశీలన చేస్తాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

గుంటూరు, అక్టోబర్10(ఆర్ఎన్ఎ) : పోలవరం ప్రాజెక్టు పూర్తికావాలన్నదే మా ధ్యేయమని, ఆ మేరకు అవసరమైన చర్యలన్నీ చేపడతామని బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గాంధీ 150 జయంత్యుత్సవాల్లో భాగంగా గాంధీ సంకల్ప యాత్ర చేపట్టనున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ యాత్రలో భాగంగా శుక్రవారం పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తామని తెలిపారు. పోలవరంలో ప్రస్తుత పరిస్థితి, ప్రగతిని ఈ సందర్భంగా తెలుసుకుంటామని చెప్పారు.

అధికారులతో మాట్లాడుతామన్నారు. పోలవరం పూర్తి కావాలన్నది తమ సంకల్పమని, ఇందుకోసం అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ నెల 13న ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కూడా కలిసి పోలవరం అంశంపై చర్చిస్తామని వెల్లడించారు. కొత్త ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలైందని.. పోలవరంలో ఏం చేసిందో చూస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగినట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. పోలవరంలో జర్మనీ పరికరాల స్థానంలో చైనా సామాగ్రి వస్తున్నట్లు తెలిసిందని కన్నా స్పష్టం చేశారు. ప్రాజెక్టు వ్యయం తగ్గడం మంచిదేనని.. నాణ్యత కూడా ఆలోచించాలన్నారు. ప్రాజెక్ట్ పూర్తయ్యాకే ఖర్చు తగ్గిందా.. పెరిగిందా అనేది తెలుస్తుందన్నారు. కేంద్రం నుంచి ఏ ప్రాజెక్టుకు నిధులు ఆపలేదని కన్నా పేర్కొన్నారు. తెలంగాణ నుంచి రావాల్సిన బకాయిల విషయంలో సీఎం చొరవ చూపాలన్నారు. కేసీఆర్‌తో జగన్‌కు మంచి సంబంధాలు ఉన్నాయని.. విభజన అంశాలు త్వరగా పరిష్కరించాలన్నారు. జగన్ వైఖరి చూస్తుంటే రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు లేదని, వారి కార్యకర్తలకు పంపకాలు బాగానే చేస్తున్నారు కదా అని కన్నా పేర్కొన్నారు.

ప్రైవేట్ వ్యక్తులతో కలసి ఆర్టీసీని సమాధి చేసే కుట్ర

ఉద్యోగులకు డిస్మిస్ చేయడం అంత ఈజీ కాదు

ముఖ్యమంత్రి కేసీఆర్ తీరు అప్రజాస్వామికం

అఖలపక్ష భేటీలో మండిపడ్డ కోదండరామ్

ఉద్యోగుల పిఎఫ్‌ను వాడుకున్నారన్న థామస్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్ 10 (ఆర్ఎన్ఎ): ఆర్టీసీని సమాధి చేయాలని కుట్ర జరుగుతోందని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ప్రజాస్వామ్యంలో విచారణ లేని శిక్షణ ఉండదని, అన్నారు. ఆర్టీసీ విషయంలో సిఎంకెసిఆర్ నిరంకుశ వైఖరి అవలంబిస్తున్నారని, రేపు రేపు అన్ని ఉద్యోగాలకు సంబంధించి ఇదే వైఖరి ఉండబోతున్నదని అన్నారు. బుధవారం ఆర్టీసీ అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇష్టం వచ్చినట్లు ఆర్టీసీ కార్మికులను డిస్మిస్ చేయడానికి లేదనారు. ముఖ్య మంత్రి కేసీఆర్ తీరు అప్రజా స్వామికమని విమర్శించారు. ఆర్టీసీని నిలబెట్టేందుకు కార్మికులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలన అంతం కావాలని పిలుపు ఇచ్చారు. పండగ ముందు సమ్మె జరగొద్దనే స్పృహ సీఎంకు ముందే ఉండాలని కోదండరాం అన్నారు. ప్రైవేటు వ్యక్తులతో కలిసి సీఎం కేసీఆర్ ఆర్టీసీని సమాధి చేసేందుకు రెడీ అవుతున్నారని కోదండరాం ఆరోపించారు. ఆర్టీసీ సమ్మెపై తెలంగాణ ఉద్యమ ద్రోహులైన అప్పటి లీడర్లు ఇప్పటి మంత్రులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి ఒక్కడే ఉన్నడని? సమాజం మొత్తం ఆర్టీసీకి మద్దతు ఇస్తుందని చెప్పారు. దేశంలో ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చుడు సులభం కానీ? ఊడపీకటం ఎవని తరం కాదని? సమ్మె చేస్తున్న వాళ్లకు ప్రభుత్వం ముందుగా నోటీసు ఇవ్వాలని.. చేసిన నేరాన్ని బట్టే శిక్ష ఉంటదని? ఏ చిన్న నేరానికైనా ఉద్యోగాన్ని తీయలేరని అన్నారు. దేశ ద్రోహం చేసినప్పుడు తప్ప? నోటీసు ఇవ్వకుండా ఉద్యోగాన్ని తీసేయలేరు.. ఇది ఏ ప్రజాస్వామ్యం ఒప్పుకోదు? ప్రజాస్వామ్యంలో విచారణ లేని శిక్ష ఉండనే ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి నేనే చట్టం, నేనే రాజ్యంగం అని అనుకుంటున్నరని ఘాటుగా విమర్శించారు. ఎర్రమంజిల్ విషయంలో ఎలా అయితే కేసీఆర్ భంగపడ్డాడో.. ఆర్టీసీ విషయంలో అలాగే భంగ పడ్తడని అన్నారు.. ఇప్పుడు గనుక ప్రజలు, మిగితా ఉద్యోగ సంఘాలు నిద్రలేవకపోతే? భవిష్యత్తులో అందరూ అన్యాయం అయితరని అన్నారు. ఆర్టీసీ లేకపోతే ఆర్థిక వ్యవస్థ లేదు.. ఇది గుండె లాంటిదని చెప్పారు. ఆర్టీసీని నిలబెట్టుకునేందుకే కార్మికులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఖఖీఅ అడిగితే ఉద్యోగులకు కూడా ఆర్టీసి కార్మికులకు జరిగినట్టే జరుగుతుందని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కాగా ఆర్టీసీ అఖిలపక్ష సమావేశం గురువారం) సాయంత్రం 3గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఆర్టీసీని ప్రైవేట్ పరం చేసేందుకు సీఎం కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు ఆర్టీసీ జేఏసీ నేత థామస్ రెడ్డి. ఆర్టీసీకి ఇవ్వాల్సిన రాయితీలను ఇంతవరకు ఇవ్వలేదున్నారు. కార్మికుల పిఎఫ్ డబ్బులను ప్రభుత్వం వాడుకుందని? పండగపూట వారికి జీతాలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందన్నారు. కార్మిక చట్టాల ప్రకారమే సమ్మె నోటీసులిచ్చామన్నన థామస్ రెడ్డి.. కార్మిక సంఘాలను చర్చలకు పిలవకపోవడం దారుణమన్నారు. కార్మికులను బయపట్టాలని ప్రభుత్వం చూస్తోందని. .అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేదన్నారు. కార్మికులెవరూ ఆందోళన చెందవద్దని.. ప్రజల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని థామస్ రెడ్డి తేల్చి చెప్పారు.

BEFORE THE MACT-Cum-HON'BLE 1st ADDL CHIEF JUDGE: CCC AT: SECUNDERABAD

O.P. No. 80 of 2019

Between:

Guda Lavanya @ Vedala Lavanya & others

..Petitioners

And

E. Srinu & others

...Respondents

To.

1 . Etharada Sreenu
S/o Seethaiah,
Age: Major, Occ: driver of Car
Br.No.AP-29-M-7929,
R/o.H.No.43-113,
Hanuman Nagar,
Near Moula Ali Khaman,
Hyderabad.

2. Godala Varalaxmi W/o Srinivas
Aged About: Major,
Occ: owner of car
Br.No.AP-29-M-7929
R/o.H.No.3-9-9/12/1/A,
Nehrunagar,
Ramanthapur, Hyderabad.

NOTICE

Please take notice that in the above matter the Petitioner had filed case against you Respondent No.1 and Respondent No.2 for compensation and the same is posted for your appearance on 16-10-2019.

You are advised to appear on **16-10-2019** at 10.30 A.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided ex party.

(BY THE ORDER OF THE COURT)

E.BALA KRISHNA,
V. SHANTHI
M. PRASHANTH
Advocates
H. No.5-12-186-/8,
H.B.Colony, Moula Ali,
Hyderabad
9849124065,

చైనా అధ్యక్షుడి కోసం చెన్నై ఎయిర్‌పోర్టులో స్వాగత తోరణాలు

చెన్నై, అక్టోబర్ 10: చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ రేపు చెన్నైకి రానున్నారు. ఆయన రాక కోసం ఎయిర్‌పోర్టు అధికారులు, సిబ్బంది స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయన రెండు రోజుల (11-12) పాటు భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అవుతారు. వారిరువురికి అనధికార సమావేమని తెలుస్తోంది. జమ్మూ కశ్మీర్‌కు గల ప్రత్యేక ప్రతిపత్తి ఆర్టికల్ 370ని భారత ప్రభుత్వం రద్దు చేయడంతో పాకిస్తాన్ భారత్‌కు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టేందుకు పలు అగ్రదేశాల నేతలతో సమావేశమై తన గోడు వెల్లగక్కుతోంది. ప్రస్తుతం పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ చైనా పర్యటనలోనే ఉన్నారు. ఆయన చైనా ప్రధానితో భేటీ అయి కశ్మీర్ అంశంపై చర్చిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి సమయంలో చైనా అధ్యక్షుడు భారత పర్యటనకు రావడం చర్చనీయాంశమైంది. అమెరికా సహా పలు అగ్ర రాజ్యాలు ఆర్టికల్ 370 విషయంలో భారత్‌కు మద్దతునిచ్చిన విషయం తెలిసిందే.

సమస్యలు పరిష్కారమయ్యేవరకు..

సమ్మెను విరమించం

- కార్మిక సంఘాల ఐకాస చైర్మన్ అశ్వత్థామ

హైదరాబాద్, అక్టోబర్10(ఆర్ఎన్ఎ) : సమ్మెను అణిచివేయాలని చూస్తే ఏ ప్రభుత్వానికైనా ఇబ్బందులు తప్పవని కార్మిక సంఘాల ఐకాస ఛైర్మన్ అశ్వత్థామరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఆర్టీసీ సమ్మెపై హైకోర్టుకు తమ వాదన వినిపించామని అన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. సాయంత్రం 4 గంటల తర్వాత తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రజారవాణా వ్యవస్థను కాపాడేందుకే తాము ప్రయత్నిస్తున్నామన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని చెప్పారు. యాజమాన్యం వైఖరే సమ్మెకు దారితీందని అశ్వత్థామరెడ్డి అన్నారు. ఉద్యోగాలు తొలగిస్తున్నట్లు తమకు నోటీసులు రాలేదని.. వస్తే స్పందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ వాస్తవాలను గ్రహించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్మికుల ఉద్యోగాలకు ఇబ్బందేమీ లేదని.. అందరూ ధైర్యంగా ఉంటూ ఇదే స్ఫూర్తితో సమ్మెను కొనసాగించాలని అశ్వత్థామరెడ్డి సూచించారు. సమ్మెలు, ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేస్తే ఏ ప్రభుత్వానికైనా ఇబ్బందులు తప్పవన్నారు. కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరిపి సమ్మె నివారణకు ప్రయత్నం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు.

పదవి కోసం అడ్డదారులు తొక్కే వ్యక్తి తలసాని

ఆర్టీసీ ఆస్తులను కొల్లగొట్టి మల్టీప్లెక్స్‌లు కట్టే యోచన

కరీంనగర్‌లో మండిపడ్డ ఎంపి బండి సంజయ్

కరీంనగర్,అక్టోబర్10 (ఆంఎన్ఎ): తెలంగాణ ఆర్టీసీ కార్మికుల పట్ల అనుచితంగా మాట్లాడిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ అంతటి మూర్ఖుడు ఎవరులేరని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మండిఎడ్డారు. అధికారం లో ఉన్నవారికి కొమ్ముకాసి మంత్రి పదవులు పొందే తత్వం తలసాని శ్రీనివాస్‌దని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం కరీంనగర్ బస్ స్టేషన్‌ను సందర్శించిన సంజయ్.. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు తలసానిని గల్లీల్లో తరిమికొట్టే రోజులస్తాయని అన్నారు. ఆర్టీసీ విధుల్లో డ్రైవర్లు, కండెక్టర్లు అనారోగ్యం పాలవుతున్నారు.. కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్నారని తెలిపారు. కార్మికులు నెలరోజుల కిందటే సమ్మె నోటీస్ ఇచ్చినా సీఎం కేసీఆర్ వారిని అణగదొక్కాలని చూశారని విమర్శించారు. ఇన్నిరోజులుగా ఎందుకు స్పందించలేదని కెసిఆర్‌ను ఆయన ప్రశ్నించారు. బీజేపీ నుంచి ఆర్టీసీ కార్మికులకు మద్దతు ఉంటుందని చెప్పారు. ఆర్టీసీ సమ్మెతో కేసీఆర్ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ ఆస్తులను కబ్జా చేసి మల్టిప్లెక్స్‌లను నిర్మించుకునే కుట్రలో భాగంగానే సంస్థను ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులను కేసీఆర్ ఎలా తొలగిస్తారో తాము చూస్తామని సవాలు విసిరారు. యూనియన్లకు అతీతంగా ఆర్టీసీ కార్మికులంతా ఒకటి కావాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ సమ్మెపై బీజేపీ రాష్ట్ర కమిటీ త్వరలోనే సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

బతుకు తెలంగాణ కావాలి : జీవన్‌రెడ్డి

ప్రగతి భవన్‌లో బతుకమ్మ అడితే.. తెలంగాణ మొత్తం బతుకమ్మ పండుగ జరుపుకున్నట్టు కాదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిగిత్యాల జిల్లా కోరుట్లలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. కార్మికుల సమ్మెకు వెళ్లారంటే.. అందుకు సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇది మరో తెలంగాణ కోసం చేస్తున్న పోరాటమని అభిప్రాయపడ్డారు. తమకు బంగారు తెలంగాణ వద్దని.. బతుకు తెలంగాణ కావాలని వ్యాఖ్యానించారు. మరోవైపు జగిత్యాలలో టీటీడీపీ

రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సీఈ

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 10: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కేటీపీఎస్ సీఈ ఆనంద్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయడానికి కాంట్రాక్టర్ నుంచి ఆనంద్ లంచం డిమాండ్ చేశాడు. కాంట్రాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల పన్నిన అవినీతి నిరోధక శాఖ అధికారులు రూ. 3 లక్షలు లంచం తీసుకుంటుండగా రెండ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.సీఈని అదుపులోకి తీసుకున్న అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లంచం ఇవ్వడం, లంచం తీసుకోవడం నేరమని ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.